వార్ధక్యంలో ఆ తల్లి చిన్న కూతురి ఇంట్లోనే వుండాలని ఎందుకు కోరుకొంది?

చిల్లర భవానీ దేవి కథ

# మనసు లోతుల్లో

సూర్యభగవానుడు సహస్రాధిక బాహువులను పైకిసాచి లోకానికి వెలుగు ప్రసాదించాలని బయలుదేరాడు.

బాత్‌రూమ్‌లో స్నానం చేస్తున్న తాయారమ్మ చుట్టూ ఓసారి చూసింది. బాత్‌రూం గోడలకి తాపడం చేసిన తెల్లని టైల్స్ సిల్వర్‌గ్రులైటు వెలుగులో మరింతగా మెరుస్తున్నాయి. షవర్ తిప్పింది తాయారమ్మ. నులివెచ్చని నీరు ధారగా హాయిగా పడుతోంది. సబ్బులు పెట్టుకోడానికి ముత్యపుచిప్ప ఆకారంలో అందమైన అమరిక! మొహంమీద గోరువెచ్చని నీరు పడుతుంటే మనసు సేదదీరినట్లుంది ఆవిడకు.

ఆబగా తపనగా నాలుగైదు బకెట్లు స్నానం చేసింది తాయారమ్మ. గీజరు సౌకర్యముంది కాబట్టే ఎన్ని నీళ్ళయినా వేడిగా వాడుకోవచ్చు. ఎన్ని పోసుకున్నా తనివితీరడంలేదు. అటువంటి సౌకర్యాలతో అందమైన ఆ బాత్‌రూంలో స్నానం చేస్తుంటే తాయారమ్మకి తన వయసు హఠాత్తుగా తగ్గినట్లుగా అన్పిస్తోంది. శరీరం అంతా వెన్నెల వెలుగులు ప్రసరించినట్లుగా అనిపిస్తున్నది.

స్నానం ఆపేసి తెల్లని ఇస్త్రీ టవలుతో తుడుచుకుని మాధవి ఇచ్చిన తెల్లచీర కట్టుకుని మాధవి బెడ్‌రూంను పరిశీలనగా చుట్టూ చూసింది. ఎంత నీట్‌గా సర్దుకుంది. మాధవిలో చిన్నప్పుడు ఇంత శుభ్రత వుందా? క్రమశిక్షణ వుందా? ఎంత అల్లరిగా తిరిగేది.

కాలేజీనుంచి రాగానే పుస్తకాలు షెల్ఫ్‌లోకి విసిరికొట్టి 'అమ్మా కాఫీ' అంటూ



గావుకేక పెడుతుంటే తనెన్నిసార్లు కోప్పడింది? ఆ మాధవేనా ఇలా మారిపోయింది! ఇప్పుడెంత అమరికగా సర్దుకుంది. ఓ మూల గోడకి ఉన్న రాక్‌లో ఎన్నో పుస్తకాలు పేర్చి వున్నాయి. వాటి ప్రక్కనే వున్న షోకేస్‌లో వింత వింత ఖరీదైన పింగాణీ బొమ్మలు గోడ మూలగా టీపాయ్ మీద పింగాణీ ఫ్లవర్‌వాజ్‌లో అందమైన ఎర్రగులాబీలు,

కిటికీలకున్న సిల్కు కర్టెన్లు తళతళలాడుతూ ఆ ఇంటి ఐశ్వర్యాన్ని చాటుతున్నాయి.

గది మధ్యలో రెండు డబుల్‌కాట్ మంచాలు విడదీయరాని బంధంతో అతుక్కొని వున్నాయి. దగ్గరగా వెళ్ళి మంచంమీద ఓసారి కూర్చుంది తాయారమ్మ.

పాల నురుగులాంటి దుప్పటి. కూర్చున్నప్పుడు మెత్తని పరుపు ఇచ్చిన ఆనందం ఆవిడను ఉక్కిరిబిక్కిరి చేసింది. ఇలాంటి మంచంపైన మధురమైన కోరికలు పండించుకోవాలని తానెన్నిసార్లు అనుకుంది. ఆయన తన కోరిక విని ఎంతగా ఎగతాళి చేశారో! తాను సిగ్గుల మొగ్గయి ఊరుకుందిగానీ మనసులో కోరికమాత్రం అలాగే సమాధి అయింది. దేనికైనా పెట్టిపుట్టాలి. మాధవి చాలా అదృష్టవంతురాలు!

ఆమె మనసులోని ఆనందం అంతా మంచులా కరుగుతోంది. అంతవరకూ తాను అనుభవించిన ఆనందం మంచులా కరిగిపోతోంది. నిట్టూర్చి వంటగది ప్రక్కనే వున్న పూజగదికేసి వెళ్లింది తాయారమ్మ.

దేవుడి మందిరం ఎంత కళకళలాడిపోతున్నది! వెండితో చేయించిన సీతారామలక్ష్మణ విగ్రహాలు ఎంత అందంగా వున్నాయి. ఫోటోలు కూడా వెండి రజను అద్ది ప్రత్యేకంగా తయారు చేయించినవే! ఆ పూజామందిరమంతా లక్ష్మి తాండవిస్తోంది. అగరొత్తుల మసితో మసకబారిన ఫోటోలు గుర్తుకు వస్తున్నాయి.

తాయారమ్మ ఐదు నిమిషాలు కళ్ళు మూసుకుని దేవుడిముందు కూర్చుంది. శరీరం దేవుడిముందు ఉందిగానీ మనసుమాత్రం అక్కడలేదు. ధ్యాస, ఏకాగ్రత కుదరడంలేదు. ఇలాంటి స్థితి ఆవిడకు ముందెన్నడూ అనుభవంలోకి రానిది.

ఇక లాభం లేదనుకుని లేచి వంటింట్లోకి వెళ్ళింది. ఒకస్టవ్‌మీద చిక్కని పాయసం. రెండో స్టవ్ మీద వంకాయకూర ఉడుకుతూ నోరూరిస్తున్నాయి.

ఆమె మనస్సు కలుక్కుమంది. ఓసారి దీర్ఘంగా నిట్టూర్చింది. "అమ్మా! స్నానం అయిందా!" మాధవి అలికిడికి వెనక్కి తిరిగి అడిగింది.

"ఆ అయిందమ్మా!" అంటూ మాధవిని తేరిపార చూసింది తాయారమ్మ.

రాత్రి తాను పొద్దుపోయి వచ్చింది కాబట్టి మాధవిని సరిగా గమనించలేదు. రాగానే నిద్రపోయింది. ఎక్కువసేపు మాట్లాడలేదుకూడా! కూతుర్ని సరిగా చూడలేదుగానీ మాధవి మొహం తేలింది. జుట్టుకు ఎర్రటి రబ్బర్‌బ్యాండ్ వేసింది. పండు టమోటారంగు షిఫాన్ చీర, అదేరంగు జాకెట్ వేసుకుంది. పచ్చటి ఆమె మేనిఛాయ ఆ దుస్తులలో మరింత ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

ఎర్రని శిల్ప బొట్టు, మెడలో ఎర్రరాళ్ళ పతకం, ముక్కుకు మెరుస్తున్న రవ్వ పుడక, ఒక్కో చేతికి ఆరేసి బంగారుగాజులు. మాధవి ఎంత అదృష్టవంతురాలు! ఆమె మనసులో ముల్లు గుచ్చుకున్నట్లయింది. కూతురికి తన దిష్టే తగులుతుందేమోనని భయపడి చూపు మరల్చుకుని పప్పులోకి ఆకుకూర తరగాలని ఉపక్రమించింది తాయారమ్మ.

హిమబిందు లేస్తూనే "గుడ్‌మార్నింగ్ అమ్మమ్మా!" అంటూ వచ్చింది.

మాధవికి ఆ పిల్ల ఒకటే సంతానం కావడాన బాగా గారాబం చేసినట్లుంది. కూతుర్ని ముద్దుగా కోప్పడి ఆమె కాలకృత్యాలు తీర్చుకోవడంలో సాయంచేస్తున్న మాధవిని చూస్తుంటే మనసంతా చేదుగా అనిపిస్తోంది తాయారమ్మకు.

హిమబిందు తన క్లాసులోని పిల్లలగురించి అమ్మమ్మకు చెప్తూనే వుంది. తల్లి పోలికతో ఏడేళ్ళ హిమబిందు అప్పుడే అందంగా కనిపిస్తోంది. ఆరోగ్యంగా మిసమిసలాడుతోంది. గ్లాసెడు పాలు కూతురుకి దగ్గరుండి తాగిస్తోంది మాధవి. తాయారమ్మకు గుండెలను చీలుస్తున్న భావన కలిగింది. కళ్ళు విప్పార్చి చూస్తూనే ఆలోచనలో పడింది తాయారమ్మ.

హిమబిందును స్కూలుకు పంపి భర్తను ఆఫీసుకు పంపాక తల్లి దగ్గర కూర్చుని ఇంటిదగ్గరవాళ్ళ యోగక్షేమాలు అడిగింది మాధవి.

తల్లికి ఇల్లంతా దగ్గరుండి చూపించింది. ఇల్లంతా దివ్యంగా వుంది. అడుగడుగునా సిరి తాండవిస్తోంది. ఆధునిక గృహిణి నిర్మించుకున్న అధునాతన గృహంలా వుంది ముందు వరండా. దానికి వెనుక పెద్దహాలు. హాల్లోంచి అటూఇటూ రెండు పడకగదులు. హాల్లోంచి నేరుగా వంట ఇల్లుతోబాటు డైనింగ్‌హాలు. రెండు బెడ్‌రూమ్‌లకు ఎటాచ్డ్ బాత్‌రూమ్స్ ఉన్నాయి. ఒక గెస్ట్‌రూమ్ వుంది.

"అమ్మా! అన్నం వడ్డిస్తున్నా" పేపరు చూస్తున్న తాయారమ్మ దాన్ని సోఫాలో పడేసి భోజనానికి లేచింది. భోజనం చేశాక తల్లికి గెస్ట్‌రూమ్ చూపించింది విశ్రాంతి తీసుకోమని. తాయారమ్మకు మనసంతా చిక్కుపడిన దారపు వుండలా వుంది. అలా ఆలోచిస్తూనే వుంది. నిద్ర పట్టేసిందామెకు

హిమబిందు గొంతు విన్పించగానే గభాలున మెలకువ వచ్చేసింది తాయారమ్మకు.



## మింగుడు

భర్తతో గాభరాగా అంది నిర్మల.

"ఏవండీ... మన చంటిది అర్ధరూపాయి బిళ్ల మింగింది. డాక్టర్ దగ్గరకు తీసుకెళ్దామండీ?"

"చాల్లే! డాక్టర్ రూపాయలే మింగుతాడు" విసుగ్గా అన్నాడు భర్త.

—పద్మశ్రీ (మాణిక్యారం)

లేచి మంచం మీద కూర్చుంది. ఉదయంను ంచి మనసులో చిక్కుపడిన దారపు ముళ్ళు వీడినట్లనిపించింది.

కాఫీ ఇస్తున్న కూతురితో మెల్లగా "రేపు ఉదయం బండికి ఊరెళతాను" అని చెప్పిం ది. "మాద్దాంలే. అపుడే ఏం తొందర" అంది మాధవి.

తాయారమ్మకు ఆ రాత్రి భోజనం సరిగా సయించలేదు. కూతురు చేసిన తనకిష్టమైన కందిపచ్చడి తినలేకపోయింది. ఘుమఘుమలాడే నెయ్యిని వద్దన్నది.

తాము ఫారిన్‌నుంచి వస్తూనే అమ్మని పిలిపించుకోవాలన్న మాధవికి ఆమె ప్రవర్తన చిరాకు కలిగించింది.

"ఇక్కడ ఏం తక్కువయిందని ఆ అసంతృప్తి" తనలో తానే విసుక్కున్నది.

ఆవిడ పదేపదే వెళ్తానంటుంటే ఏమీ అనలేక మౌనంగా వుండిపోయింది.

రాత్రి తాయారమ్మకి నిద్రపట్టలేదు. అటూ ఇటూ తిరిగింది. పచార్లు చేసింది. అంతా పడుకున్నారు. హిమబిందు తను వెళ్తున్నానని చెపితే ఏడ్చి రాత్రి తన దగ్గరే పడుకుంది. తాయారమ్మ ఆలోచనలు పెద్ద కూతురు సుమతి మీద వాలుతున్నై.

తండ్రి అర్థాంతరంగా పోతే ఆ ఉద్యోగం లో చేరి ఇంటి బాధ్యత తీసుకుంది సుమతి. తల్లినీ చెల్లెలునూ బాధ్యతగా చూసింది. పెళ్ళిచేసుకుని ముగ్గురు బిడ్డలు కలిగాకే ఆమె భర్తను ఆ దేవుడు చూడలేక తీసుకుపోయాడు. అప్పటికే సుజాత ప్రేమి ంచిన వ్యక్తిని వివాహం చేసుకుని అతనితో ఫారిన్ వెళ్ళింది. బావగారు పోయారన్న వార్తకు అక్కకు సానుభూతితో ఉత్తరం మాత్రం రాసింది సుజాత.

ముగ్గురు బిడ్డలతో బ్రతుకునావను భార ంగా ఈదుస్తున్న సుమతి తల్లి పోషణాభారం కూడా వహించింది.

సుమతి, పిల్లలూ గుర్తుకొస్తుంటే ఎప్పు డెప్పుడు తెల్లవారుతుందా అనిపించింది తా యారమ్మకు.

బండిదిగి సుమతి ఇంటితలుపుతట్టిన తాయారమ్మకు వెలసిన చీర, రేగినజుట్టు, చేతిలో చీపురుతో తలుపుతీసింది సుమతి.

"వచ్చావా అమ్మా! రా! నిన్నటినుంచీ నీకోసం పిల్లలు అప్పుడే బెంగపెట్టేసుకున్నా రు. చెల్లెలెలా వుంది" మాధవిపట్ల ఆపేక్ష సుమతిగొంతులో తొణికిసలాడుతోంది. మాధవి అయితే ఎంత పొడిపొడిగా అడిగింది సుమతి గురించి! అనుకోకుండా ఉండలేక పోయిందావిడ.

"లేవండ్రా! అమ్మమ్మ వచ్చింది" ముగ్గురు పిల్లల్నీ లేపేసింది సుమతి. చింపిరి నెత్తులతో వాళ్ళంతా నిద్రలేచి అమ్మమ్మ ను చుట్టేశారు. వాళ్ళ కళ్ళలో ప్రతిఫలిస్తు న్న మమకారం, ఆనందం తాయారమ్మ మనసును ఆర్ద్రం చేసింది.

"నీళ్ళు వస్తున్నాయి. నేను పడతాను. అమ్మా కొంచెం కాఫీ కాయి. ఇవాళ నేను త్వరగా ఆఫీసుకు వెళ్ళాలి" హడావుడిపడు తోంది సుమతి.

యాంత్రికతను దుస్తులుగా ధరించి బోసిపోయిన జీవితంతో స్పందనలేని మర బొమ్మలా వున్న సుమతిపట్ల తాయారమ్మ గుండెలు సానుభూతితో బరువెక్కాయి.

కూతుర్ని చూసి నిట్టూర్చి తామా రంగప్రవేశం చేసిందావిడ.

పదిరోజులు. మాధవి దగ్గర వుండి వస్తానని వెళ్ళిన అమ్మ ఇలా ఒక్కరోజుకే వచ్చినందుకు కారణం తెలుసుకోవాలనిపించి నా సుమతి అడగలేదు. అమ్మ త్వరగా వచ్చినందుకు ఆనందంగానూ వుంది ఆమెకు.

తల్లి తనపట్ల చూసేచూపులో మాత్రం ఏదో తెలీని తేడా ఇంతకుముందు లేనిది కనిపిస్తోందని ఖచ్చితంగా అర్థంచేసుకుంది సుమతి.

కూతుర్ని ఆఫీసుకూ, మనవళ్ళని స్కూలుకు పంపి ఎప్పటిలాగే మధ్యాహ్నంపూట విస్తళ్ళు అమ్మడానికి కుట్టుకుంటోంది తాయారమ్మ.

"వీళ్ళకి నా అవసరం వుంది. వీళ్ళ మనస్సుల్లో నాపట్ల ఆత్మీయత వుంది" అనుకుంటున్న ఆమె మనసు చిన్నప్పటినుండీ తల్లి బాధ్యతలను తన భుజస్కందాలపైకెత్తుకుని జీవనసమరం చేస్తున్న సుమతి అలసటనుకూడా గుర్తిస్తోంది.

అక్కడ మాధవి మాత్రం తన భర్తతో తన సంపద, ఇల్లూ, నగలుచూసి అసూయపడి తల్లి త్వరగా తిరిగి వెళ్ళిపోయిందని చెబుతుంటే అర్థం చేసుకోలేని మనసుతో హిమబిందు ఆసక్తిగా వింటున్నది.

*

